# మతంలేని మనుషులు



ఏ వేళ తెలివి వచ్చేసరికి చెవులు చిల్లులు— దేరిపోయినట్లు రైలు యింజను అరచింది. కిటికీనుండి చూస్తే కొళాయిదగ్గర పొరుగు క్రొత్తకోడలు కామోసు బాల్చీతో నీరు పట్టుకుంటోంది. వుక్కు—మిల్లు గొట్టాలనించి పొగ కెరటాలుపోతూ ఆకాశాన్ని కప్పుతున్నాయ్.

ఈ వేళ దాదారాధేశామ్ ఆకాశం లాంటి నిర్మలమైన మన స్సేంటో ఆ పొగలాంటి ఆలోచనలతో కప్పబడుతోంది. ఈ రోజు కొడుకు వేగంగా మిల్లుకు పోయాడు. వాడి కళ్ళు చూస్తుంటే తనకే భయంవేసింది. వారం రోజులు నిద్రలేని మనిషిలా వున్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా యెర్రగావున్నాయ్—

బలివాడ కాంతారావు

"బహుశః మా కోడలు జ్ఞాపకానికి వచ్చుంటుంది. ఎక్కడవుందని వెళ్తాడు? ఎలా మనసు కట్టుకుంటాడు? పరిస్థితులు యిలా తారుమారవుతాయని నే నెప్పు డయినా కలలోనైనా అనుకున్నానా? ఐనా కొనవూపిరి వున్నంతకాలం ఆశతో బ్రతకాలి. ఏదో పిల్లను చూసి వీడికి ముడిపెట్తాను."

ఇక్కడ తనను 'దాదా' అని యెవరూ పిలవరు. తనదగ్గరకు వచ్చి కష్టసుఖాలు చెప్పుకుని యెవరూ యేమీ యాచించరు. ఇక్కడ పొలాలు లేవు; పంటలు లేవు; గలగల ప్రవహించే నదిలేదు; తోటలూ పశువులూ, పచ్చగడ్డీ అంతకంటే అగ పడవు. ఐనా యీ వాతావరణానికి అల వాటు చేసుకుంటున్నాడు. పొయ్యిమీద అన్నంగిన్నె పెట్టి, అక్కడ కూర్చు న్నాడు. మండుతున్న మంటలవేపు తదేకదీక్షగా చూస్తుంటే అదేంటో ఆ యిరవై యేళ్ళ క్రితం తను రాజేసిన మంటల్లా అగుపించాయ్. "అవును; నా భార్య 'ప్రొతిమ'ను 'పొద్దు' (తూర్పు పాకిస్థాన్‌లోని 'పద్మా'నది) వడ్డున కాల్చేశాను. విధి అలా వ్రాసుంది. అగ్గి చేతులతో ముట్టిస్తాం. మనం ఆర్పక పోతే అదే ఆరిపోతుంది. మనసులో రేగిన అగ్గిని మళ్ళీ కాటిలో అగ్గే ఆర్పాలి. జీవితం యెంత విచిత్రమైనది? ఎక్కడి వాణ్ణి యెక్కడికి వచ్చాను? ఎప్పుడైనా యిక్కడకు వస్తా ననుకున్నానా? ఇలా వంట చేస్తా ననుకున్నానా? నా ప్రొతిమ పోయేసరికి బిమల్ బడిలో చిన్న చిన్న పద్యాలు వల్లిస్తున్నాడు కదూ? వాడికి లెక్కలు చేసే వయస్సొచ్చేసరికి పొద్ద ఒడ్డున నా తోటలో ప్రొతిమ బుగ్గయిన చోటే మొలచిన మొక్క పెరిగింది. నాకు పండొకటి రాల్చి మరీ పోయింది నా ప్రొతిమ. పండులాంటి ఛాయతో నా బాబు బిమల్ పెద్దవాడయ్యాడు. ఇన్నాళ్లూ నా ప్రొతిమ ఆ చెట్టురూపంతో నా కళ్ళ యెదుట మసలుతుంటే, నాబాబు చదువు సంధ్యలు ఆటపాటలు చూసుకుంటూంటే యెందరు చెప్తే నేను మళ్ళీ పెళ్ళాడ గలను! పొద్ద ఒడ్డుని యింపుగా యెర్రని పూలతో అగుపించే చెట్టును చూసి, యెందరు పడవ నడిపేవాళ్ళు వుదయం సాయంత్రం వుల్లాసంగా పాటలు కురి పించలేదు. వెన్నెలంతా చెట్టుమీద వ్రాలి పోతే చూట్టానికియెంతచక్క వుండేది! మా ప్రొతిమ ప్రాణం మళ్ళీ చెట్టులోనికి దిగి చెట్టు కదిలి నా వేపు వచ్చేటట్లు అని పించేది! ప్రొతిమ యెంత మనోహ రంగా బ్రతికిందో అంత అందమైన రూపంతో యీ చెట్టుగా వెలిసింది. ఎంత నమ్రత, మర్యాదతో మెసలిందో యీ పూలలో అంత మాధుర్యమూ వుంది."

పొంగులువచ్చి అన్నం కుత కుత వుడుకుతుంటే గరిటతో కలిపాడు. ఓ సారి ఒక మెతుక పట్టుకుని చూశాడు.

"నా ఆస్థీ ప్రొతిమ కాపరానికివచ్చాక

యిలాగే పొంగింది. ఆమె పోయాక అలాగే నిల్చిపోయింది. పొలాల్లో రోజంతా కష్టపడేవాళ్ళ మధ్య నేనుండే వాడ్ని. నాగలి పట్టుకుంటే యెంత హాయిగా వుండేది. పనివాళ్ళంతా నన్ను గట్టుమీద కూర్చుని పాడమనేవాళ్ళు. పెద్దమడి గట్టుమీద యీతచెట్టుక్రింద కూర్చొని, "ఐ మేరె బంధూరే..." అని గొంతెత్తితే నా యెడ్లజత నడుస్తూనే తల లాడించేవి. గట్టుమీద మేస్తున్న నా కామధేనువు తలాడిస్తూ నా దగ్గరకు వచ్చేసేది. వెనుకన పెద్దకాలువనించి పోయే పడవల తెరచాపలు రెపరెప లాడేవి. ఈతకొమ్మలు లయవేస్తున్నట్లు కదిలి చప్పుడు చేసేవి – సాయంత్రం వరకూ అలానే పొలాల్లో వుండిపోయినా, ఆయాసము అనిపించేది గాదు. ఎంత చక్కని ప్రదేశం, ఎంత చల్లని గాలి, ఎంత తీపి నీరు, ఎలాంటి సారవంతమైన మట్టి. పొద్ద పొంగిన దినాల్లో మా నరాలన్నీ అలాగే పొంగిపోయేవి. తెప్ప పట్టుకుని యీదుతూ పొద్ద కోపంతో త్రోసుకొచ్చిన కలపను ఒడ్డుకు చేర్చేవాళ్ళం. మా పొలాలలో ఆ కోపంతో, తెచ్చిన మట్టిబంగారాన్నంతా వొంపేసేది. తల్లి కడుపులాంటి చల్లదనంతో మళ్ళీ ప్రశాంతం. ఆ కడుపులో మా కరువు తీరిపోయినట్లు రకరకాల చేపలు – ఈ వేళ పిల్లల్లా వుండి పదిరోజుల్లో బలిసి పోయేవి. చిన్న చేతి వల విసిరితే వల నిండా పడేవి. తింటే పొద్దలోని మగర్లే తినాలి, తాగితే పొద్ద నీరే తాగాలి. మా తరతరాలూ అక్కడే పుట్టారు. ఆ నీరు పండించిన ధాన్యాలే తిన్నారు. ఆ నీటిలో పెరిగిన చేపలే తిన్నారు. ఆ నీటిమీదే పడవల్లో తిరిగారు. ఆ నీటిమీదే ప్రయాణం చేశారు. ఆ నది ప్రేమలోనే మునిగి తేలారు. వాళ్ళ శరీరంలోని రక్తం ఆ నదిలోని నీరే అయ్యింది. చివరకు ఆ నదివొడ్డునే బుగ్గయ్యారు. మళ్ళీ ఆ నది ఆ బుగ్గిని తనలో కలుపుకుంటూ పొలాల్లోనికి పరుగెత్తేది... ఇదివరకువాళ్ళ ముత్తాతల బుగ్గితో కలిపేది. ఆ బుగ్గిమీద పంటలు పండేవి. ఆ పండే ధాన్యం బ్రతికిన తరాలవాళ్లు తిన్నారు. అలాంటి పొద్ద మా ప్రాణం మా సర్వస్వం అయ్యింది. దాని ఒడ్డునే బుగ్గవుతా ననుకున్నాను. ఆ ఆస్తిపాస్తులు పోతెపోయె. మళ్ళీ నేను నా చిన్ననాటి నుంచీ చూస్తుండిన ఆ పొద్దను చూడగలనా? ఆ దగ్గరలో బుగ్గి కాగలనా? మా ముత్తాతల బుగ్గిలో కలవగలన? ఏంటో నా కోరిక? ఈ జగం విచిత్రమైనది. మనిషి మట్టిలో పుట్టి మట్టిలో కలుస్తాడు. ఒక ప్రయోజనంతో పుట్టాడు. ఒక ప్రయోజనం కోసం బుగ్గవుతాడు. ఏదో ప్రయోజనం లేకుండా యీ జగతిలో ఒక ఆకు రాలదు, ఒక దోమ వాలదు, ఒక ప్రాణి భూమి మీద పడదు. ఒక జీవి చావదు."

దాదా అన్నం దించుతూ చెయ్యి కాల్చుకున్నాడు. పొయ్యిమీద కూరకు పెడ్తూ తడబడిపోయాడు. నూనె బదులు నీరు పోసేశాడు.

"సరే అలా వుడకనీ- నా కోడలే వుంటే నాకీ కష్టం యెందు కొచ్చేది. తల్లిని చూసి, ఆ పిల్లను కోడలుగా తెచ్చుకున్నాను. ఎంత వందన మైనది. ప్రొతిమ మళ్ళీ యెన్నాళ్ళకు మా యింట్లో అడుగు పెట్టినట్లయింది. నాలో యవ్వనంలో వుండిన వుత్సాహం వచ్చేసింది. ఇన్నాళ్ళూ యిల్లు యిల్లాలు లేనిదైంది. మళ్ళీ యిరవై యేళ్ళకు యీ యిల్లు పవిత్రమైంది. ఇంట్లో రెండు పావురాలు వున్నట్లయింది. పూజా పునస్కారాలు, అతిథి సత్కారాలు, దాన ధర్మాలు, అలకలూ- ప్రేమలూ, ఆప్యాయతా, అభిమానం కూడిన జీవితం, యెన్నాళ్ళకు- యెన్నాళ్ళకు! నా కోడలు బందన యింటికే కాదు. వూరికే వందన మైంది. ఆ చిరునవ్వుతో అన్ని పనులూ బెత్తాయించుకుంటూ, నౌకర్లకూ, దాసీలకూ, దొడ్లో పశువులకూ, నాకూ- అందరికీ తల్లిలా చల్లదనంతో వెలుగు నిస్తుండిన కోడలు- మహా యిల్లాలు. నేనే చెయ్యెత్తి నా మనస్సులో దండం పెట్టుకున్న సుగుణవంతురాలు. జన్మజన్మాలకు తపస్సు చేసినా దొరకని మాణిక్యం. నా యింటి దేవత......"

దాదా వలవలా యేడ్చేశాడు. అనుకోడానికీ, ఆలోచించడానికీ మనస్సు పిప్పి అయిపోయింది. గుండెను యెవరో పట్టుకుని గోధుమపిండి ముద్దను పిసికినట్లు పిసికివేస్తున్నాడు.

"ఈ పాడు రాజకీయాలు నా తల్లిని యెత్తుకుపోడానికే వచ్చాయా? నా కోడలులాంటి అమాయకురాళ్ళ నెత్తుర్లు కలుషితం చెయ్యడానికేనా యీ మతం పేరిట జరిగిన ఆక్రోశాలు? మనుషుల్లో పంతాలు తల్లిరొమ్ము కోయడానికేనా? నా కోడలు యేం పాపం చేసింది? ఆ పాతివ్రత్యానికీ, ఆమె దాన ధర్మాలకీ, పుణ్యానికీ - ప్రతీకారం... బలవంతంగా ... ఆమెను ... దేవునిపేరు చెప్పి చెరచడమేనా? ఇదేనా మనుషులు ప్రగతి పథానికి పోతున్నామనటం? నా కోడలు యీసరికి తన చేతులతోనే తనే పీక పిసుక్కొనివుంటుంది ... ఆ లక్ష్మీదేవిని ... ఆ సరస్వతిని ... ఆ సీతని ... యెవరూ అంటలేరు; ముట్టలేరు. ఆ దేవత శవాన్ని ముట్టుకున్నా, పాపులై, భస్మమైపోతారు. ఒక్కసారి నా యింటిని చుట్టుముట్టినప్పుడు నా కంతా అయోమయమైపోయింది. నన్ను యమభటులు గాని నరకానికి తీసుకువచ్చారా అనుకున్నాను. ఇదివరకు నా దగ్గరకు అప్పుకు వచ్చినవాళ్ళే - నాకందరూ ఋణపడినవాళ్ళే - నా ఆదరణనూ, నా ఈవినీ పొందినవాళ్ళే, నామాట వినగానే

హడలిపోయి, శిరసావహించినవాళ్ళే – వారందరూ–నా యెదర, చేత కత్తులతో నిల్చున్నారే... పట్టపగలు... నమ్మలేక పోయాను. ఇన్నివేల సంవత్సరాలు ఐక్యంగా బ్రతికిన బ్రతుకులు. భాయ్, భాయ్ అన్న సౌభ్రాతృత్వం– ఒక్క రాజకీయాలసారా తప్పత్రాగిన, తలా హృదయంలేని మనిషి రెచ్చకొట్టగానే అంతా మరచిపోయారా? రోజుల్లో వేల కొద్దీ సంవత్సరాలుగా నున్న సహనం ముక్కలై పోయింది. ఇదిగో నా కేమీ వద్దు. మేం ముగ్గురం నిల్చున్నపాటున పోతాం... నా బిమల్ కళ్ళు పులికళ్ళలా వున్నాయ్. మాటాడితే వాడి పీక తెగుతుందని తెలుసు. కోపంతో అట్టుడికి పోయాడు. నా వెంట పడ్డ కోడలుచెయ్యి పట్టుకున్నా డొకడు. విసరి లాక్కుని, నా దగ్గరగా వచ్చేసి, నన్ను చిన్నపిల్లలా పట్టేసుకుంది. నలుగురూ యేకమై లాగారు. గోల... ఆ గోల... యిరుగు పొరుగు వాళ్ళ భార్యలు, ఆ గోల విని వూరుకున్నారేం? వాళ్ళ పిల్లల గోలలా లేదూ? వెనక్కి పరుగెత్తాను. నలుగురూ నన్ను అడ్డుకున్నారు. కత్తులు నావేపే చూపించారు. బయటకు మా యిద్దర్నీ తోసివేసారు. కామధేనువు కట్టుచుట్టూ గాబరాగా తిరిగిపోతోంది. నా మతి భ్రమించిపోయింది. అక్కడ మేము వుండలేం. కాని నా కోడలూ, ఆ భూమీ, యెర్ర పూలచెట్లూ, కామధేనువూ, నేను పుట్టి పెరిగిన యిల్లూ, అన్నిటినీ మించి 'పొద్ద' నదీ... వదలి, సాయబుల్లా వేషాలు వేసుకుని నేనూ, నా బిమల్ మహాత్ములు పుట్టినదేశం, దేశమంటే మట్టికాదు మనుషులన్న గుండెలు, పుణ్య నదులూ, తీర్థాలూ, వున్నతమైన ఆశయాలూ, మంచు శిఖరాలూ, జాలాశయాలూ, దగ్గరగా శిలలుగా సమకారంతో జన్మించిన దేవతలూ, అన్నిమతాలకూ, అన్ని వర్గాలకూ ఆశ్రయమిచ్చిన అమృతహృదయం యీ హిందూదేశం వచ్చేశాం. ఇక్కడ శిల్పాలుగా నిల్చిపోయిన సౌందర్యం, జీవనదులుగా పొంగే సంస్కృతీ, మూడు మతాల గుడులూ ఒకచోట వుండగలిగే సహనము, అన్నిటికీమించి దేవుని ముద్దుబిడ్డ పెద్దగానున్న ప్రభుత్వం చల్లదనంవలన యింతచోటు, కొడుకునకు అతను కట్టిన ఆధునిక దేవాలయంలో వుద్యోగం ... ఎక్కడి పొద్ద? ఎక్కడ నేనున్నాను. ఇంతదూరం ధైర్యంతో యెలా రాగలిగాను? బహుశః ఆ సంస్కృతి తరతరాలకూ వదలిపెట్టిన గీతావాక్యం—

"బ్రతికి వున్నంతకాలం కామం, క్రోధం మొదలైన వాటివల్ల కలిగే క్షోభను తట్టుకున్నవాడే యోగి. అతడే సౌఖ్యవంతుడు"—

నన్నిలా తీసుకువచ్చి బ్రతకనిస్తోందేమో? నాలాగే గతంలో యీ పుణ్యభూమికి యెందరెందరో వచ్చారు. ఎన్నో

మతాలు యిక్కడ తల దాచుకున్నాయ్. ఆపదలందు కడుపులో దాచిన ఈ చల్లని తల్లిదరికి చేరకండా యెక్కడికి పోగలం?"

వంట అయ్యాక దాదా కొడుకునకు కేరియర్ పంపించాడు. చాపమీద చేత విసినకర్ర పట్టుకుని దొర్లుతున్నాడు. గీతావాక్యాన్ని మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకుంటున్నాడు.

"మాలాంటి కుటుంబాల నెన్ని లక్షలను వాళ్లు తరిమివేసారు; చేసిన పాపాలకు ఫలితం అనుభవించకండా యెవ్వరూ పోలేరు. వాళ్ళను శిక్షించడానికి నే నెవర్ని? ఏ దేముడిపేరు, మతంపేరు చెప్పి, అమాయకుల రక్తాన్ని తాగుతున్నారో, ఆ దేముడే, ఆ మతమే వాళ్ళను శిక్షిస్తుంది. అటువేపు యీ మధ్య రెండుసార్లు తుఫానులు వచ్చి యెందరినో తుడిచిపెట్టిందట; రాయ్‌పూర్లో నేనున్నప్పుడు గాలివానలు యెప్పుడూ యెరగను. వాళ్లు చేసిన పాపాలకు ప్రతిఫలం యిలా వేలాది ప్రజలు అనుభవించరా? భూకంపాలు వచ్చి మట్టినీ, ఆ పాపపు మనుషులనూ యీ సరికి మింగేసేవి. కానీ ఆ భూమిమీద పదిహేనేళ్ళక్రితం ఒక దైవసమానుడు, మహాత్ముడు నడచి పాదముద్రలు వేశాడు. ఆ పవిత్ర పాదముద్రలను భూకంపాలు మింగలేవు. అందుకే అవి రాలేదు. అతని చల్లదనమే యింకా వాళ్ళను కాపాడుతున్నదని తెలుసుకోరు......"

ఇలా ఆలోచనలతోనే సాయంత్రం అయిపోయింది. ఇంకా కొడుకు రాలేదు. రాత్రి వంటలో సహాయం చేసేవాడు. తనే మళ్ళీ పొయ్యి వెలిగించాడు. కొద్దిగా వీస్తున్న గాలి అదోలా బరువుగా తగుల్తోంది. తన శరీరం జిడ్డుగా ముతకగా వున్నట్లుంది. ఐనా అలా పొయ్యి దగ్గరనే కూర్చున్నాడు. ఈనాటి దుఃఖం లానే చీకటికూడ, ముంచుకొచ్చింది. చిల్లులుపడ్డ నల్ల గుడ్డలా ఆకాశం వుంది. తనవేపు తనే భయంకరంగా చూసుకుంటున్నట్లనిపించింది. రాత్రి యెనిమిదైనా కొడుకు రాలేదు. బహుశః యే సినిమాకో వెళ్ళిపోయి వుంటాడు. ఒంటిగా వుంటే రాయ్‌పూర్ గ్రామ్, భార్యా, బుగ్గిమీద లేచిన చెట్టు,— దాని కొమ్మనైనా విత్తనాన్నైనా తేలేక పోయానన్న బాధ — యివన్నీ తన గుండెను యేనాడో చిల్లులు చేశాయ్. అప్పుడప్పుడూ అందులోంచి రక్తం చిమ్ముతూనే వుంది. ఆ చిల్లులను గీత చదువుకుంటూ, చదివినది తలచుకుంటూ, అది తెచ్చిన వేదాంత ధైర్యంతో తాత్కాలికంగా కప్పటానికి ప్రయత్నిస్తూంటాడు.

ఇంతలో తలుపుతట్టిన చప్పుడైంది. అదే తడవుగా గాబరాగా కొడుకైతే తట్టడే. గబగబా దాదా వెళ్ళి తలుపు

తీశాడు. పొరిగింటి క్రొత్తకోడలు గబగబ లోనికి చొరబడిపోయింది. అరె, ఈవేళ వుదయమే తను లేవగానే ముద్దు మోముతో నవ్వుతూ కొళాయి దగ్గర కనిపించిందిగా! మొగుడూ పెళ్ళాలు అంత అన్యోన్యమైనవాళ్ళే — ఈ పిల్లను చూస్తూంటే ... ఆ ముఖంలో మా బందన కుండే అమాయకం, ఆప్యాయత కనిపిస్తాయ్. ఇంతలో యింత గాబరా దేనికి? ఆమె అతని కాళ్ళమీద పడిపోతూ దాదా! మీరే నన్ను రక్షించాలి!"

"ఏమైందమ్మా..."

"ఆయన యింకా మిల్లునించి రాలేదు. వారి కేమైందో... ?"

"ఓవర్ టైమ్ వచ్చివుంటుంది. ఇంకా యెనిమిదే అయ్యిందిగా... "

"అదేంటో నాకు భయం వేస్తోంది. ఆ ప్రక్కవీధిలో మా మతం వాళ్ళ యేడుపులు వినిపిస్తున్నాయ్."

"హాఁ... యిక్కడా మతంపేరిట పీకలు తెగేస్తున్నారా? నమ్మను ... నమ్మను ..."

"లేదు దాదా! వాళ్ళు మా యింటికే వస్తారు... నన్ను భంగం చేస్తారు ... నా తండ్రిలాంటి వాడివి ... నన్ను రక్షించు."

దాదా కళ్ళల్లో నీళ్ళు తిరిగిపోయాయ్. ఈ ముస్లింయువతి 'అచ్చంగా తన కోడలులాగే కనిపించింది. ఆ యేడుపులో కోడలుగొంతుక, తపన — అన్నీ తనను యింకా రావ్ పూరులో వున్నట్లు భ్రమింపజేసాయ్.

"నా యింట్లో నిన్నెవ్వరూ ముట్టుకో లేరు ... పద ... వంటయింట్లో కూర్చో ..."

ఆమెను వంటయింట్లో కూర్చోబెట్టి తలుపు వేస్తూ, ఆమె మక్కావేపు తిరిగి అల్లాను ప్రార్థిస్తూ వుండటం చూశాడు. మళ్ళీ గదిలోకి వచ్చి తనూ చేతులు జోడించి కళ్ళు మూసుకున్నాడు. రాను రాను కోలాహలం అధికమైంది. పొరుగు యింట్లోనికి మనుషులు జొరబడ్డారని తెలుసుకున్నాక తనగుండె వడిగా కొట్టుకో సాగింది. నిస్పృహ చెందిన కిరాతకులు తనయింటి యెదరగా ఆగి, అందులో ఒకడు —

"ఇది హిందువుల యిల్లు — పోదాం పదరా" అన్నాడు. ఇంకోగొంతుక తురకల పొరుగునే వుంది. ఇందులో దాదా, చాలా జాలిమనిషి — ఆ చక్కని దాన్ని దాచాడేమో ?"

దాదా ఒళ్ళు ఒక్కసారి జలదరించింది. మనసుకు కర్తవ్యం స్ఫురించి, భీష్మించి, కటువైపోయింది. ఆ గొంతుక యిది వరకు విన్న గొంతుకే ... తలుపు తట్టగానే తీశాడు.

"ఏం కావాలి? ఇది హిందువుల యిల్లు.

"పోరుగు తురకల పిల్ల యిక్కడ వుందా?"

"నేను తప్పించి యిం కెవ్వరూ లేరు."

"అతని మాట నమ్మకండి," అంటూ ఒక యువకుడు ముందుకు వచ్చాడు.

"నువ్వా – బిమల్ ... రాక్షసుడివై పోయావా?"

"రాక్షసుడ్ని! ... నాన్నా! అప్పుడే మరిచిపోయావా? 'నీ కోడల్ని పట్టి లాగుకుపోతున్న' ఆ దృశ్యం అప్పుడే మరిచిపోయావా? నా పుణ్యశీలను చెరచిన వాళ్ళకు ప్రతీకారం యిది...లే అడ్డులే."

"అంతరోషం వున్నవాడివైతే ఆ చెరచినవాళ్ళ భార్యలమీద, చెల్లెళ్ళమీద నీ ప్రతాపం చూపించలేకపోయావా? చూడు నాయనా, యీ అమాయకురా లేం తప్పుచేసింది. ఒకరిని బదులు యిం కొకరిని శిక్షించకండి నాయనలారా! దేముడు అంతకంటే ఘోరమైన శిక్ష మనకు విధిస్తాడు.

"మాకు మతం కంటే ముఖ్యమైన దేదీలేదు. మాకు ఆలస్య మవుతోంది. లే ... అడ్డు లే–"

"ఏమతం అమాయకుల పీకలు తెగేమని చెప్పలేదు. మీ పాదాలు పట్టు కుంటున్నా. నా మాట నిలపండి – నా హామీని పాలించనివ్వండి."

ఒకడు దాదాను ప్రక్కకు త్రోసివేశాడు. దాదా చప్పున లేచి "ముందుకు అడుగు వెయ్యడానికి వీల్లేదు" అంటూ అడ్డుకున్నాడు.

"ప్రాణం మీద తీపి పోయిందా?" కటువుగా ప్రశ్నించా డొకడు.

"నన్ను పొడిచి నా శవం మీదనించి వెళ్ళండి. నేను చూస్తుండగా ఆమె మానం భంగంకాదు."

వాళ్ళ పెద్ద కన్నుసైగ చెయ్యగానే, నలుగురు దాదాకు రెండువేపులా చేతులు పట్టుకుని, గింజుకుంటున్నా, ప్రక్కకు లాగివేశారు. దాదా అరుస్తూ, కూలబడి పోయాడు. వంటయింటివేపు పరుగెత్తి ఆమెను బయటకు లాగుకొనివచ్చి, గదిలో దాదా యెదురగాత్రోశారు. ఆమె 'దాదా!' అంటూ అరుచుకుంటూ, దాదా మీదపడి, చిన్నపిల్లలా వెక్కివెక్కి యేడుస్తూ, "నే నేం తప్పుచేశాను దాదా! వా శ్ళెవ్వరో చేసిన పాపాలకి, వీళ్ళు న న్నెందుకు శిక్షిస్తున్నారు దాదా! ... దాదా ... దాదా ... ఖుదాలాంటి వాడివి. నన్ను వదిలేమని చెప్పు దాదా! మీ చెల్లెలులాంటిదాన్ని కనికరించండి బాబూ ... కనికరించండి ... దాదా ... దాదా ...!

దాదా అప్పటికే ఒకషాక్ తగిలిన ట్లుగా మూర్ఛపోయాడు. ఆమె యేడుపు రానురాను దూరమైపోయింది. దాదాకి

మూర్ఛనించి తెలివివచ్చేసరికి తాలం శూన్యంగా కనిపించింది. ఆ శూన్యంలో గిరగిర తిరుగుతున్నట్లుంది. కాస్సేపయాక యెముకలు మిగిలిన చెక్కిళ్ళపై ముడుతలుపడ్డ చర్మంమీద కన్నీరు కార



జొచ్చింది. ఆవేదనపొందిన హృదయముతో రెండు చేతులూ జోడించి...

"మతం పేరిట ఒకమహాత్ముడినే కాల్చిచంపిన మనుషులు, ఒకయిల్లాలిని విడిచిపెట్టారా? ఈ మతం